# నేలబారు మనిషి

"నవ్య, సిద్ధు నుంచి విడిపోయింది తెలుసా నీకు?"

నా పెళ్లి రిసెప్షన్‌కి ఆహ్వానించడానికి వెళ్లిన నాతో అంది సరిత.

ఆశ్చర్యంగా చూశాను. 'అదేంటి? ఎందుకు?' అడిగాను.

'ఏమో తను ఊహించుకున్నంత సంతృప్తికరంగా లేదట అతనితో జీవితం.' మంచినీళ్ల గ్లాసు అందించి నా పక్కనే సోఫాలో కూర్చుంటూ అంది.

చల్లగా ఉన్న ఆ నీళ్లు వేపాకులతో మరిగించినంత చేదుగా అనిపించాయి. సరిత చెప్పిన వార్త తాలూకు అనుభూతి కాబోలది. చేదు తిన్న భావన... పెళ్లి అయి ఏడాది కూడా పూర్తి కాలేదు. అప్పుడే నవ్య భర్త నుంచి విడిపోడం ఏంటి? పైగా ప్రేమ వివాహం కూడాను. సుమారు రెండేళ్లు ప్రేమించుకుని, పెళ్లి చేసుకున్నారు. అదే అన్నాను సరితతో "అదేంటి సరితా... అప్పుడే విడాకులేంటి? అసలు ఒకళ్లనొకళ్లు అర్థం చేసుకోడానికైనా కొంతకాలం కలిసి ఉండాలి కదా..."

సరిత పెదవి విరుస్తూ అంది... 'లేదులే చాలా ట్రై చేసింది. కుదరలేదు. దూరపు కొండలు నునుపు అని... సిద్ధు స్నేహితుడుగా ఉన్నంతకాలం అతనిలో లోపాలు తెలియలేదు. దగ్గరయాక ఒక్కొక్కటే తెలుస్తోంటే భరించలేకపోయింది. అందుకే ఇంక విడిపోయింది. ఇప్పుడు చాలా హాయిగా ఉంది.

'ఏంటసలు ప్రాబ్లెమ్?' అడిగాను.

'అబ్బో చాలా ఉందిలే కథ. తనే చెప్తుంది వెళ్తావుగా... ఒట్టి నేలబారు మనిషి అతను.'

'అంటే...' అయోమయంగా చూశాను.

అంటే.. ఏం ఉంది? హోప్‌లెస్.. అయినా తొందరెందుకు? దాన్ని ఇన్వైట్ చేయవా? రిస్పెషన్‌కి... వెళ్లు తనే వివరంగా చెప్తుంది.

అసలే తను బాధలో ఉంటే నేనెళ్లి ఇప్పుడు పెళ్లికి పిలిస్తే ఏమనుకుంటుంది.

నాదీ ప్రేమ పెళ్లే...

నేనూ విశాల్ ఇంజనీరింగ్ కాలేజీలో చేరిన దగ్గర్నించి క్లాస్‌మేట్స్‌మి... ఇద్దరం పరస్పరం ఇష్టపడి పెళ్లి చేసుకున్నాం.. మా రిజిస్టర్ మ్యారేజీ అయి వారం అయింది... ముఖ్యమయిన స్నేహితులకు పార్టీ ఇవ్వడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాం ఇద్దరం... ఇరు పక్షాల పెద్దవాళ్లు ఒప్పుకోకపోడానికి ఒకే ఒక కారణం మా కులాలు వేరు. ఏమైనా మేమిద్దరం మాత్రం మా నిర్ణయాన్ని ఎవరికోసం వదులుకోలేకపోయాం. ఒకరి నొకరు బాగా అర్థం చేసుకున్నాం. మా ఇద్దరికీ కూడా పరస్పర అవగాహన, పరస్పర అనురాగం ఉంది. మేము మాత్రం ఇలా అనాలోచితంగా విడిపోము కదా. ఒక్కసారి ఉలిక్కిపడ్డాను. వెడ్డింగ్ కార్డు ఇస్తూ, విడాకుల గురించి ఆలోచించడం స్టుపిడిటీ.

'హలో ఏంటి ఆలోచిస్తున్నావు?' నా మొహం మీద చిటిక వేస్తూ అడిగింది సరిత.

'ఏంలేదులే... వెళ్లనా వద్దా నవ్య దగ్గరికి అని ఆలోచిస్తున్నా' అన్నాను.

'అదేంటి నన్ను పిలిచి తనని పిలవకపోతే ఏమనుకుంటుంది? ముగ్గురం స్నేహితులమేగా ధన్యా' అంది.

'అవును... కాని పాపం తనే బాధలో ఉంటే...'

'నాన్సెన్స్' నా మాట మధ్యలోనే కట్ చేస్తూ అంది సరిత. బాధా, పాడా... శుభ్రంగా గారెలొండి తద్దినం కూడా పెట్టేసింది.

నాకెలాగో అనిపించింది. ఆరునెల్లకే అంత విరక్తి కలిగిందా? ఇదేనా వివాహానికి ఉన్న బలం. మాంగల్య బలం అంటారు... అది ఈనాటి తరానికి వర్తించదా? ఇంత బలహీనమైందా ఈతరం వాళ్ల మాంగల్యం... ఏదిఏమైనా వినకూడని వార్త, వినకూడని సమయంలో విన్నాను. ఈ వార్త నా మనసులో ముల్లులాగా గుచ్చుకుంటూనే ఉంటుంది. ఆ ముల్లు తాలూకు బాధ అనుభవిస్తూనే అన్యమనస్కంగా సరిత ఇచ్చిన కాఫీ తాగి, తన అభినందనలు అందుకుని నవ్య ఇంటివైపు వెళ్ళాను.

నన్ను చూడగానే మొహంనిండా నవ్వుతో ఆహ్వానించింది. నేను ఊహించి నట్టు విషాదం మూర్తీభవించి లేదు. చాలా హాయిగా రిలాక్స్‌డ్‌గా ఉంది.

'కంగ్రాట్స్ ధన్యా... హోప్ విశాల్ ఈజ్ నైస్...' అంది.

'చాలా మంచివాడు. నీకూ తెలుసుగా విశాల్' అన్నాను.

'అవును కానీ, నీకు తెలిసినంతగా కాదు" అంటూ నవ్వి 'జ్యూస్ తాగుతావా?' అడిగింది.

'నాకేం ఒద్దుకానీ ఏంటి నేను విన్నది నిజమేనా?'

'ఏం విన్నావు?' చిరునవ్వుతో చూసింది.

నేను చెప్పలేక, చెప్పలేక చెప్పాను. 'నువ్వు, సిద్ధు...'

సోఫాలో వెనక్కి వాలి 'నిజమే విడిపోయాం...' అంది.

'ఎందుకిలా?' బాధగా అడిగాను.

'నుదుటి రాత అననా? నా ఖర్మ అననా? లేక నా అదృష్టం అననా?'

'ఏమైంది మీమధ్య ఇంత తీవ్రంగా గొడవలు ఎందుకయ్యాయి? ఎలా అయ్యాయి?'

'గొడవలా? నో, నో నేనసలు అతనితో గొడవే పడలేదు."

"మరి... విడాకులు...'

'అతని స్వభావం, పద్ధతులు, అతనిలో పర్వతంలా పేరుకుపోయిన స్వార్థం. ఇంకా చాలా ఉన్నాయిలే తరవాత మాట్లాడుకుందాం సావకాశంగా. నువ్వేదో శుభవార్తతో వస్తే ఈ గొడవెందుకు?' అంటూ లేచి వెళ్లి ఫ్రిజ్ తెరిచి ఆరెంజ్ జ్యూస్ రెండు గాజుగ్లాసుల్లో పోసి తీసుకొచ్చింది.

'ఏంటో చాలా బాధగా ఉంది నవ్యా' అన్నాను జ్యూస్ సిప్ చేస్తూ.

'నాకు మాత్రం చాలా శాంతిగా, సుఖంగా ఉంది' అంది జ్యూస్ తాగుతూ.

కొన్ని క్షణాలు మామధ్య నిశ్శబ్దం నిట్టూర్చింది.

'ప్రేమికులుగా ఉన్నప్పుడు ఎదుటివారిలో మైనస్ పాయింట్స్ కూడా ప్లస్‌గా కనిపిస్తాయి. వాళ్లలా కనిపించేలా ప్రవర్తిస్తారనుకుంటా... కానీ, దగ్గర కొచ్చాక అసలు రూపం బైటపడుతుంది. అవి భరించే శక్తి మనలాంటి వాళ్ల కుండదు. మనం ఇండివిద్యువాలిటీ కొంచెం ఎక్కువగా ఉన్నవాళ్లం కదా..." నవ్వి గ్లాసు టీపాయ్ మీద పెట్టింది.

'అవునూ ఇంతకీ విశాల్ ఏంచేస్తున్నాడు?'

'ఈమధ్యే ప్రైవేట్ కంపెనీలో చేరాడు.'

'నువ్వు...?'

'నీకు తెలియదా నేను మూడు నెలలైంది డిగ్రీ కాలేజీలో మ్యాథ్స్ లెక్చరర్‌గా

చేస్తున్నాను.'

"ఇంజనీరింగ్ చేసి లెక్చరర్ జాబా? కొంచెం వెయిట్ చేస్తే మంచి జాబ్ వస్తుందిగా"

నేను మాట్లాడలేదు. లెక్చరర్ జాబ్ ఎంచుకోవడంలో విశాల్ ఇష్టానికే ప్రాధాన్యత నిచ్చానన్న సంగతి చెబితే నవ్య ఈ పెళ్లే ఒద్దంటుంది. నేను ఉద్యోగం పేరుతో బైట ఎక్కువసేపు గడపడం అతనికిష్టంలేదు. లెక్చరర్‌గా అయితే ఇంట్లో ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉంటుందనే తనే ఎవరితోటో చెప్పించి నాకీ జాబ్ ఇప్పించాడు. విశాల్ చెప్పింది సబబే అనిపించి నేనూ ఒప్పుకున్నాను. కానీ నవ్యకి ఇలా చెబితే నీకసలు వ్యక్తిత్వం ఉందా? అంటూ ఉపన్యాసం ఇస్తుంది. పెద్ద ఫెమినిస్టసలే. అందుకే మాట మారుస్తూ అన్నాను... 'పెళ్లి కోసం జాబ్ చేస్తున్నా...తర్వాత తీరుబడిగా మంచి జాబ్ వెతుక్కుంటా...'

'పెళ్లికెందుకింత తొందరపడుతున్నావు?'

'తొందరా?' నవ్య కళ్లల్లోకి చూశాను. అలా నన్నడగడంలో నేను చేసిన తప్పే నువ్వు చేస్తున్నావా? అన్న భావన కనిపిస్తుందేమో అని వెతుకుతున్న దానిలా.

నవ్య చాలా క్యాజువల్‌గా ఉంది. నా ఆలోచనలు గమనించినదానిలా అంది... 'ఇంకా ఉద్యోగాల్లో స్థిరపడలేదు కదా అని అంటున్నాను.'

'నిజమే... ఆ విషయం నాకూ తెలుసు, అటు విశాల్‌గానీ, ఇటు నేనుకానీ ఇంకా పూర్తిగా సెటిల్ అవలేదు. కానీ, సెటిల్‌మెంట్ కోసం వెయిట్ చేస్తే జీవితంలో చాలా మిస్ అవుతున్నట్టు అనిపిస్తోంది. ఐనా ఇంత త్వరగా ఎలా సెటిల్ అవుతాం? గవర్నమెంట్ ఉద్యోగాలు కాదు కదా! మనవి ప్రైవేట్ ఉద్యోగాలు... ఈ ఉద్యోగం నచ్చకపోతే మరో ఉద్యోగం వెతుక్కుంటూ వెళ్లడమే... దానికోసం జీవన మాధుర్యం కోల్పోలేం కదా...'

నవ్య నవ్వింది. నాకెందుకో ఆ నవ్వులో ఎగతాళి కనిపించింది. కానీ నన్ను ఎగతాళి చేసేంత కుసంస్కారి కాదు నవ్య. బహుశా నేనే అలా ఊహిస్తున్నానేమో.

'ఏనీవే కంగ్రాట్స్... రిసెప్షన్‌కి తప్పకుండా వస్తాను.' అంది చేయి అందుకుంటూ.

'థాంక్స్... రావాలి... రాకపోతే ఊరుకోను కదా' అన్నాను తన చేయి నొక్కి విడిచి, బై చెబుతూ.

నవ్య గుమ్మంలో నిలబడి బై చెప్పింది.

రిసెప్షన్ చాలా గ్రాండ్‌గా జరిగింది. మేము ఆహ్వానించిన స్నేహితులంతా వచ్చారు.

అందులో కామన్ ఫ్రెండ్స్ ఎక్కువగా ఉండడంతో చాలా సరదాగా, ఆహ్లాదంగా గడిచింది. జోకులతో, చిన్నచిన్న సెటైర్‌లతో మమ్మల్ని ఆటపట్టించారు. మా రిసెప్షన్ నవ్య, సరిత కూడా బాగా ఎంజాయ్ చేశారు. నవ్య ఖరీదైన పూలబొకే ఇచ్చింది.

పార్టీ ముగిసింది. ఒక్కొక్కరే డిన్నర్ పూర్తిచేసి సెలవు తీసుకుని వెళుతూ 'స్వీట్ నైట్' అంటూ కొత్తదనంతో అభినందిస్తూ వెళ్ళిపోయారు.

రాత్రి పదకొండు దాటింది. వచ్చినవాళ్లంతా వెళ్లిపోయారు. నేనూ, విశాల్ మిగిలాం. మాముందు టేబిల్ మీద మిత్రులు అందచేసిన బహుమతులు... అవన్నీ బోయ్‌తో రూమ్‌కి పంపమని మేనేజర్‌కి చెప్పి, మేము ఫస్ట్‌నైట్ కోసం ఏర్పాటు చేసుకున్న రూమ్‌లోకి వెళ్లిపోయాం.

నేను మంత్రముగ్ధురాలినై ఆ రూమ్‌లో మాకోసం చేసిన ఏర్పాట్లు చూస్తూ నిలబడిపోయాను. అందంగా అలంకరించిన మంచం, కళాత్మకంగా పేర్చి ఉన్న పళ్లు, పాలు, స్వీట్స్, చల్లదనాన్ని పరిమళంతో నింపిన రూమ్ ఫ్రెష్‌నర్... గాజు జగ్గులో మంచినీళ్లు.

'ఎలా ఉంది?' వెనగ్గా వచ్చిన విశాల్ నా భుజం మీద తన గడ్డం ఆన్చి మృదు గంభీరంగా అడిగాడు. అతనంత దగ్గరగా చేరి అలా అడగడంతో నా అణువణువూ జల్లుమంది. సిగ్గుతో కళ్లు వాల్చాను. విశాల్ నాకు అభిముఖంగా వచ్చి తన కుడిచేయి చూపుడువేలితో నా గడ్డం ఎత్తి 'సిగ్గా' అన్నాడు. నేను చేతుల్తో మొహం దాచుకున్నాను.

'ఆధునిక యువతులు కూడా సిగ్గుపడతారా?' అన్నాడు చేతుల్లో బంధిస్తూ...

'ఎక్స్‌క్యూజ్‌మీ సర్" బైట నిలబడిన రూమ్ బోయ్ స్వరం విని నేను దూరం జరిగాను.

చేతినిండా బహుమతులతో గుమ్మం బైట నిలబడి ఉన్నాడు. 'కమిన్' అన్నాడు విశాల్.

బోయ్ అవన్నీ తీసుకొచ్చి ఓ మూలగా ఉన్న టేబిల్ మీద సర్దాడు.

'ఏమన్నా కావాలా సార్' వినయంగా అడిగాడు.

విశాల్ ఒక్క క్షణం ఆలోచించి 'యా జానీవాకర్' అన్నాడు.

'యస్ సర్' బోయ్ వెళ్లిపోయాడు.

నేను విశాల్ వైపు అయోమయంగా చూశాను. 'ఇప్పుడెందుకది?'

'ఇప్పుడే కావాలి... కిక్ కోసం' అంటూ తమాషాగా కళ్లెగరేసి కోటు తీసి హాంగర్‌కి తగిలించాడు.

కిక్ కోసం అది కావాలా? అంటే.. నాకేం అర్థంకాలేదు. మొదటిసారి ఏకాంతంలో శరీరాలు, ఆత్మలు ఏకం చేసుకునే శుభసమయంలో ప్రేమించిన ప్రేయసి ఇవ్వని కిక్కు ఒక మందు బాటిల్ ఇస్తుందా?

'ఏంటి ఆలోచిస్తున్నావు? కమాన్ డ్రెస్ ఛేంజ్ చేసుకో... నో, నో డ్రెస్ తీసెయ్...' అన్నాడు కొంటెగా నవ్వుతూ.

నాకెందుకో ఇప్పుడే శృతి చేసుకుంటూన్న నా జీవనరాగంలో చిన్న అపశృతి వచ్చినట్టుగా అనిపించింది. విశాల్ వైపు చూశాను.

'ఏంటి అలా చూస్తున్నావు? జానీవాకర్ తెప్పిస్తున్నాననా?'

'అవునన్నట్టు'గా తలూపాను. 'నాకు ఈ టైంలో నువ్వు డ్రింక్ చేయడం ఇష్టంలేదు విశాల్' అన్నాను.

'ఓ గాడ్ అదా ఆలోచిస్తున్నావు. దాని పవర్ ఏంటో చూపిస్తాగా... అప్పుడు నువ్వే అంటావు ప్రతి రాత్రీ డ్రింక్ చేయి విశాల్ అని' అంటూ చటుక్కున ముందుకు లాక్కుని పెదాలు గట్టిగా కొరికాడు. ఊహించని ఆ చేష్టకి ఒక్కసారిగా నా శరీరం యావత్తూ పులకరించిపోయి, ఏదో మైకం కమ్మినట్టు అయింది.

'అబ్బా' తీయగా మూలిగాను. ఈమాత్రానికే... చెవిలో గుసగుసగా అన్నాడు. బోయ్ డోర్ శబ్దం చేయడంతో నేను బాత్‌రూమ్‌లోకి పరిగెత్తాను.

బాత్‌రూమ్ అద్దంలో నాకు నేనే కొత్తగా, అందంగా కనిపించాను. పట్టుచీర, మెడలో హారం, మంగళసూత్రం, చెవులకు జూకాలు... తలనిండా పూలు, రేగిన జుట్టు, పెదాల మీద సన్నటి గాటు. కొద్దిగా మంటగా ఉన్నా ఆ మంటలో తీయటి బాధ. ఆ తీపిదనం కోసం మనసు తహతహలాడుతున్నట్టు అయింది. ఆ క్షణంలో నాకిష్టంలేని డ్రింక్ విశాల్ ఇష్టంగా తాగుతున్నా నాకేం తెలియలేదు. అతని చేష్టలతో సర్వం మరిచి నాశరీరం అతనికి అప్పగించేశాను. విశాల్ నన్ను పూర్తిగా ఆక్రమించుకుంటూంటే పరవశంతో అరమూసుకుపోతున్న నా కళ్లకు

బెడ్‌లైట్ వెలుగులో టేబిల్ మీద అమర్చిన అందమైన పూలబొకే మీద నవ్య చేతిరాతతో అందమైన అక్షరాలు కనిపించాయి.

Fragile handle with care.

నా వైవాహిక జీవితంలో మొదటి దశ పూర్తయింది. ఈలోగా నవ్య, సరితా రెండు, మూడుసార్లు వచ్చి వెళ్లారు. ఆరోజు దసరా. మా పెళ్లయ్యాక వచ్చిన మొదటి పండగ. అన్నీ సవ్యంగా ఉండి ఉంటే పుట్టింట్లో అమ్మానాన్న, చెల్లాయి ప్రేమలతో ఎంతో ఆనందంగా గడిచేది. నేను ఎన్నిసార్లు క్షమార్పణ కోరి వాళ్ల ఆశీర్వాదాలు కోరినా వాళ్లు మొండితనం వదల్లేదు. అలాగే విశాల్ పేరెంట్స్ వైపు నుంచి కూడా ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. మరి తను వాళ్లని కన్విన్స్ చేయడానికి ఏమన్నా గట్టి ప్రయత్నాలు చేశాడో లేదో నాకు తెలియలేదు. రెండు, మూడుసార్లు అడిగితే 'వదిలెయ్ వాళ్లకి ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడే వస్తార్లే' అన్నాడు తేలిగ్గా.

దసరాకి ఇద్దరమే ఉండడం నాకెందుకో కొంచెం బాధగా అనిపించింది. విశాల్‌ని అడిగాను 'నవ్యనీ, సరితనీ పండక్కి పిలవనా' అని. 'గుడ్ ఐడియా తప్పకుండా పిలువు... సరిత వస్తుందంటావా? భర్త, పిల్లలు ఉన్నారు కదా...'

'అందర్నీ పిలుద్దాం' అన్నాను.

'ఏమో... అయినా చూడు పిలువు... నవ్య మాత్రం వస్తుందిలే... మొగుడూ, గిగుడూ బాదరబందీలేం లేవు కదా...' అన్నాడు. అలా అనడంలో వెటకారం ధ్వనించింది. మొదటిసారి విశాల్ నోటి నుంచి వినిపించిన ఈ ధ్వని వింతగా చూశాను.

'ఏంటి అలా చూస్తున్నావు... నిజమే కదా... తనూ ఒక్కతే ఉండి ఏం చేస్తుంది? అందుకే తప్పకుండా వస్తుందంటున్నా...'

నిజమేనా... వేరే ఉద్దేశం లేదు కదా... ఏమిటో ఈమధ్య విశాల్ విషయంలో కొంచెం నెగెటివ్ థింకింగ్ మొదలైంది నా మనసులో. దాన్ని ముందే తరిమేయకపోతే గొడవలకు దారితీయవచ్చు. ఇంక ఆలోచించకుండా ఇద్దరికీ ఫోన్ చేశాను. విశాల్ అన్నట్టే సరిత రాలేనంది. నవ్య అంగీకరించింది.

మర్నాడు ఐదింటికే లేచి తలస్నానం చేసి, వంట మొదలు పెట్టాను. సాంబారు, వంకాయకూర, టమాటా పెరుగుపచ్చడి, బెండకాయవేపుడు, గారెలు, రవ్వకేసరి అంతా అయేటప్పటికి పది దాటింది. మరోసారి స్నానం చేసి, కొత్త

చీర కట్టుకుని టీవి చూస్తోన్న విశాల్ పక్కన కూర్చున్నాను సోఫాలో.

'అయిందా వంటింట్లో భరతనాట్యం' అడిగాడు, దగ్గరగా తీసుకుంటూ.

'ఇలా రాజేంద్రభోగిలా కూర్చోకపోతే నాక్కాస్త సాయం చేయవచ్చుకదా...' చిరుకోపంగా అన్నాను. అలా అన్నాక అనిపించింది అవును విశాల్ నాకెందుకు కిచెన్‌లో గానీ, ఇంటిపనిలో గాని సాయం చేయడంలేదు. తెల్లారి లేచి బొంగరంలా తిరుగుతూ మొత్తం పని నేనే చేసుకుంటున్నాను. ఇద్దరం కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశాక నన్ను కాలేజీ దగ్గర డ్రాప్ చేయడం మాత్రం చేస్తున్నాడు. ప్రేమ మైకంలో నేను నా అస్తిత్వాన్ని మర్చిపోతున్నాను. ఎంతగా అలసిపోతున్నా నాలో ఈ ఆలోచనే రాలేదు. అంటే నేను విశాల్‌ని గారం చేస్తున్నానన్నమాట. కాలేజీ రోజుల్లో స్నేహితురాళ్లంతా కలిసి తీసుకున్న తీర్మానాల సంగతే మర్చిపోయినట్టుంది. అందరూ కూడా తమకు వచ్చే భర్త వంట పనిలో, ఇంటి పనిలో సాయం చేస్తేనే తాము ఉద్యోగాలు  చేయాలని నిర్ణయించుకున్నారు. అలా చేయకపోతే ఉద్యోగం చేయకూడదని కూడా అనుకున్నారు. ఆ ఆలోచనలు, నిర్ణయాలు ఏమయ్యాయో... బొత్తిగా ఇల్లాలిగా మారిపోయాను అనిపించింది.

'రేపట్నించీ నువ్వు నాకు ఇంటిపనిలో సాయం చేయాలి' అన్నాను విశాల్‌తో.

'ఇంపాసిబుల్... మనకా అలవాటే లేదు. అమ్మ వండిపెడితే తినడం, తిరగడం తప్ప నాకేం రాదు.'

'రాదేంటి నేర్చుకో... ఇద్దరం ఉద్యోగం చేస్తున్నప్పుడు ఇద్దరం ఇంటి పని చేసుకోవాలి.'

'నో డార్లింగ్... అలాంటి ఆశలేం పెట్టుకోకు. ఈ ఫెమినిస్టు టైపు డైలాగ్స్ నాకు చిరాకు.'

'అయితే నేను జాబ్ మానేస్తాను.'

'వాట్ జాబ్ మానేస్తావా?' కూర్చున్నచోటే నాలుగంగుళాలు ఎగిరి కళ్లు పెద్దవి చేస్తూ ఆశ్చర్యంగా అన్నాడు.

'ఎందుకంత ఆశ్చర్యం... మేమంతా పెళ్లికాకముందు ఇలాగే నిర్ణయించుకున్నాం. మాతోపాటు ఇంటిపనిలో, వంటపనిలో సాయం చేస్తూ, చేదోడు వాదోడుగా ఉండే భర్త వస్తేనే జాబ్ చేయాలి. లేకపోతే ఇంట్లో పని మాది... బైటపని, సంపాదన భర్తది అని..'

'ఇంకా నయం... నెలకి పదిహేను వేలు వచ్చే ఉద్యోగం మానేస్తావా? ఏం తిందామని...'

"నువ్వు సంపాదిస్తున్నావుగా...' క్రీగంట చూశాను.

'అయితే నా సంపాదన నా ఖర్చులకి, సేవింగ్స్‌కే... మిగతాది నీ జీతంతోటే గడవాలి..' ఖచ్చితంగా చెప్తోన్న అతడిని విస్మయంగా చూస్తూ ఉండగానే గేటు చప్పుడైంది. నవ్య లోపలికి వచ్చింది 'సారీ టు డిస్టర్బ్' అంటూ.

'సారీ ఏంటే... లేట్‌గా వచ్చి' చిరుకోపంగా అన్నాను.

తను తెచ్చిన యాపిల్స్, స్వీట్స్ నాకందిస్తూ అంది... 'నేను లేట్‌గా రాలేదు... నువ్వు త్వరగా వంట చేసేశావు. టైం చూడు ఇంకా పదే' అంది.

'కరెక్ట్ నవ్య ఈజ్ కరెక్ట్' అన్నాడు విశాల్ నవ్య వైపు చూస్తూ. ఆ చూపులో లోతుగా, నవ్య అనాటమీని కొలుస్తున్నట్టుగా అనిపించింది నాకు. ఏంటి ఇవాళ విశాల్ కొత్తగా కనిపిస్తున్నాడు నాకు. నాకేదో అయింది. విశాల్ మాటల్లో, ప్రవర్తనలో ఏదో వెతుక్కుంటున్నానా? లేక విశాల్‌లోనే మార్పేదన్నా వస్తోందా?

నన్ను నేను సర్దుకుంటూ 'సర్లే లోపలికి పద కాఫీ ఇస్తాను' అంటూ తనని తీసుకుని కిచెన్ వైపు నడిచాను.

నవ్య కొత్త చీరలో ఇవాళ మరీ అందంగా ఉంది. లేత నారింజరంగు షిఫాన్ చీర, మాచింగ్ పూసలదండ, మాచింగ్ చెవుల జూకాలు, మాచింగ్ గాజులు... జడలో కనకాంబరాల మాల... చాలా అందంగా ఉంది.

దసరా సరదాగా గడిపేశాం. కానీ విశాల్ నవ్యతో ఎక్కువగా మాట్లాడడం తన ఎదురుగా నాతో ఓవర్‌గా సరసాలాడడం, అర్థంలేని జోకులేసి తనే గట్టిగా నవ్వడం, నవ్య అందాన్ని మాటల మధ్యలో వర్ణించడం నేను డైజెస్ట్ చేసుకోలేక పోయాను.

నవ్య వెళ్తొంటే 'ఉండండి నేను డ్రాప్ చేస్తాను' అంటూ బండి తీసుకుని హుషారుగా బయలుదేరుతోంటే తెల్లబోయి చూస్తూ ఉండిపోయాను. చిన్నముక్క నన్ను అడగచ్చు కదా... నవ్యని డ్రాప్‌చేసి రానా అని అనిపించింది.

ఆ తరవాత కూడా రోజులో రెండుసార్లన్నా నవ్య గురించిన టాపిక్ లేకుండా విశాల్ మాట్లాడడంలేదు.

విశాల్‌లో ఈమధ్య నాకో కొత్త మనిషి కనిపిస్తున్నాడు. ఆ మనిషి నేను ప్రేమించిన విశాల్ కాదు. అతను చాలా హుందాగా, అందంగా విశాలమైన

భావాలతో ఉన్నవాడు. ఇతడు చాలా మీన్‌మెంటాలిటీగా అనిపిస్తున్నాడు. నిజంగా ఇతను నేను భావించినంత హృదయ సంస్కారం కలవాడు కాదా? ఏమో... నిట్టూర్చాను.

రోజులు గడుస్తున్న కొద్దీ విశాల్ కొత్తగా, వింతగా అనిపిస్తున్నాడు. సాధారణంగా బైటకి వెళ్లడానికి అంతగా ఆసక్తి చూపించడు. ఎక్కడికెడతాం? ఇంట్లో కూర్చుని టివి చూసుకోవచ్చు కదా... ఊరికే ఆ ట్రాఫిక్‌లో పడి ఎందుకు? అంటాడు. పొరపాటున ఎప్పుడన్నా వెళ్లినా, కొంపలంటుకుపోతున్నట్టు ఇంక ఇంటికెళ్దాం అని నస పెడతాడు... ఏదన్నా హోటల్‌కెళితే మెనూ తీసుకుని రేట్లు చూసి అన్నిటికన్నా తక్కువ రేటు ఉన్న డిష్ ఆర్డర్ చేస్తాడు. ఒన్‌బై టూ టిఫిను, ఒన్‌బై టూ కాఫీ. చూసి, చూసి చిరాకు పడ్డానో రోజు, 'ఏంటిది? ప్రతిదీ ఒన్‌బైటూ ఎందుకు? నాకు పూర్తిగా కావాలి' అన్నాను.

ఇంటికెళ్లి భోజనం చేస్తాం కదా... ఎందుకిప్పుడు డబ్బులు తగలేయడం అంటూ అంతమందిలో వాదనేసుకోడంతో నేనే నోరు మూసుకోవాల్సి వస్తుంది. ఒక వస్తువు కొనాలంటే పది షాపులు తిప్పుతాడు. ఒకటికి వందసార్లు బేరం... అటు తిప్పి, ఇటు తిప్పి, ఇది కాదు వేరేదివ్వు... అంటూ లోపల ఉన్న బాక్సులు తీసి చూపించమంటాడు. దాన్ని జాగ్రత్త అనాలో పిసినారితనం అనాలో నాకు అర్థంకాలేదు. అంతేకాక రోజూ తప్పనిసరిగా డ్రింక్ చేయడం, సిగరెట్ తరచూ కాల్చడం... ఇద్దరం ఉద్యోగస్తులం అయినా మంచినీళ్ల దగ్గర్నించి నన్ను అందించమనడం, స్నేహితులతో ఎక్కువ సమయం గడిపి ఇంటికి రావడం, అసలు సిసలైన భర్తలా రాగానే "ధన్యా వాటర్, ధన్యా వంట అయిందా? ధన్యా ఆ పని పొద్దున చేసుకోవచ్చు కదా పడుకుందాం రా..." అంటూ తొందరపెట్టడం, పడుకున్న వెంటనే తన కోరిక తీర్చుకుని గుర్రుపెడుతూ నిద్రపోవడం... మధ్య మధ్య వాళ్ల ఆఫీసులో ఆడవాళ్ల గురించి వర్ణిస్తూ, ఎగతాళిగా మాట్లాడడం వంటివి కొత్తగా గమనించడం ప్రారంభించాక ఇలాంటి వాడిని నేనెలా ప్రేమించాను అనిపించింది. ఏమోలే ఒక్కొరిలో ఒక్కో బలహీనత... అలా పట్టుక్కూర్చుంటే ఎవరూ నచ్చరు అనుకుని నాకు నేనే సమాధానం చెప్పుకుంటూ మరో ఎనిమిది నెలలు గడిపాము.

నాకు ప్రెగ్నెన్సీ రాలేదెందుకో అనే అనుమానం వచ్చిందో రోజు. ఆ రాత్రి అదే అన్నాను "విశాల్‌తో నాకు పాపాయి కావాలి... బాగా లేట్ అయింది... రేపోసారి డాక్టర్ దగ్గరకు వెళదామా?"

"పాపాలేదు... బాబులేదు... వాళ్ళొచ్చిన దగ్గర్నించి ఇల్లంతా గోల, ఉచ్చలు, వాళ్ల పనులు... నా గతేంకాను... ఇది లేకపోతే నేను ఒక్కరోజు కూడా ఉండలేను" అంటూ గట్టిగా అదుముకుని పెదాలు కొరికాడు.

నా మనసు చివుక్కుమంది. మా ప్రేమ గుర్తుగా పిల్లలుండాలని నేను కోరుకుంటుంటే తనేంటి ఇలా అంటున్నాడనిపించింది. పిల్లలు లేని ఇల్లు ఇల్లా, నాకు పిల్లలంటే చాలా ఇష్టం అన్నాను.

"కానీ, నీకో సంగతి తెలుసా! పొట్ట ఉన్న ఆడది సెక్స్‌కి పనికిరాదు. అందుకే నువ్వు గర్భవతి కావడం నాకిష్టంలేదు.'

'నీలో ప్రేమకన్నా కామం ఎక్కువ ఉన్నట్టుగా అనిపిస్తోంది" అన్నాను, అతని కళ్లల్లోకి సూటిగా చూస్తూ.

"నీమీద ప్రేమ ఉంది కాబట్టే ఎప్పుడూ ఇలా దగ్గరగా ఉండాలని ఉంటుంది. దగ్గరయాక కరెంట్ ప్రవహించదూ బాడీలో. అందుకే ఇది" అంటూ ఆక్రమించుకుంటోన్న అతడిని నిరోధించలేక నిస్సహాయంగా శరీరం అప్పగించి పడుకున్నాను.

అయితే, సరిగ్గా నెల తిరిగేసరికి నా కోరిక తీరింది. నేను నెల తప్పాను. ఆ విషయం విశాల్‌కి అప్పుడే చెప్పాలనిపించలేదు. కానీ, రోజులు గడుస్తున్న కొద్దీ నాకు వేవిళ్లు ప్రారంభమై నీరసం ఎక్కువై ఏమీ తినాలనిపించక సిక్ అయ్యాను. నా నీరసం గమనించి కారణం అడుగుతాడేమో అప్పుడు చెప్పాలని ఎదురు చూశాను. కానీ, అతనికి నన్ను రాత్రిపూట తప్ప ఇంకో సమయంలో గమనించే ఆసక్తి, శ్రద్ధ లేదని తెలిసాక చాలా బాధనిపించింది. ఈ సమయంలో నాకేది కావాలంటే అది తెస్తూ ఏం కావాలి అంటూ పదేపదే నా కోరికల లిస్టు అడుగుతూ ఎంతో మురిపెంగా చూసుకోవాల్సిన ప్రేమించి పెళ్ళి చేసుకున్న భర్త... ఆదర్శవంతమైన కాపురం కోరుకున్నాను... కానీ, ఇదేంటి ఇలా ఉంది?

నేను ఊహించిన క్షణం రానే వచ్చింది. నా నీరసం, పెరుగుతున్న నా పొట్ట చూసి చిరాగ్గా మొహం పెట్టి అడిగాడు... "ఏంటిది? ఈ పొట్టేంటి? నాకు పల్చటి పొట్ట లేకపోతే నీమీద కోరిక చచ్చిపోతుంది. వేరే మార్గం వెతుక్కోవాల్సి వస్తుంది..." అన్నాడు.

ఎంత కఠినంగా మాట్లాడుతున్నాడు? నిర్ఘాంతపోయాను. నోట మాట రానట్టుగా చూస్తున్న నా భావాలు పట్టించుకోకుండా మళ్లీ అన్నాడు. "తిండి

తగ్గించు... ఎక్సర్‌సైజ్ చేయి... అయామ్ ఫాండ్ ఆఫ్ ఫిగర్... నీ ఫ్రెండ్ నవ్య చూడు... బ్యూటిఫుల్ ఫిగర్... తినేయాలనిపిస్తుంది... అవునూ కొంపతీసి ఇది అది కాదు కదా..” అన్నాడు. నేను మూగదానిలా ఏమీ మాట్లాడే శక్తి లేనట్టు ఉండిపోయాను. అలా వాగుతూనే తన కోరిక తీర్చుకుని పక్కకి తిరిగి పడుకు న్నాడు. కడుపునిండా తిని విశ్రాంతి తీసుకుంటున్న కొండచిలువలా అనిపించాడు.

వివాహం అయిన చాలారోజులకి గుండె పగిలేలా ఏడవాలనిపించింది. కానీ, కన్నీళ్లు రాలేదు. దుఃఖం గుండెల్లో ఘనీభవించి పెద్ద బరువు నా గుండెల మీద పెట్టినట్టు అనిపిస్తోంది. నిద్రపట్టలేదు. ఎవరితోనన్నా మనసులో ఉన్నవన్నీ చెప్పుకోవాలని ఉంది. అమ్మ దగ్గరకు వెళ్లాలనిపిస్తోంది. చెల్లాయిని, నాన్నగారిని చూడాలని ఉంది. అమ్మ చేతి కందిపచ్చడి ముద్ద తినాలని, చెల్లాయితో కలిసి కట్ మిర్చీ తినాలని... ఏవేవో కోరికలు.. కానీ, కళ్లముందు మాత్రం కాలిపోతున్న గుండెలు... అవన్నీ అమ్మాయిల గుండెలే... ప్రేమ అనే సౌందర్యం అంటని గుండెలు... కాలి, కాలి నల్లగా బొగ్గుల్లా.

తెల్లవారుతుండగా కొద్దిగా నిద్రపట్టింది. కానీ, గంటకే బలవంతంగా లేవాల్సి వచ్చింది. తల పగిలిపోతోంది. ఒళ్లంతా నొప్పులు... కాలేజీకి వెళ్లాలని పించలేదు.

కాలేజీకి సెలవు పెట్టి నవ్య దగ్గరకు వెళ్లాను. నన్ను చూడగానే నవ్యకి అర్థమైంది. ‘కంగ్రాట్స్’ అంది నన్ను కావలించుకుని.

నీరసంగా నవ్వి సోఫాలో కూర్చున్నాను.

‘ఏంటే అంత నీరసంగా ఉన్నావు... వాంతులా?’ అంది.

‘ఏమీ సయించడంలేదు. తింటే వాంతి అయిపోతోంది.’

‘ఫ్రూట్స్ తినచ్చుకదా... నారింజ, దానిమ్మ తిను”

‘మార్కెట్ కెళ్లే ఓపిక ఉండడంలేదు. కాలేజీ నుంచి నేరుగా ఇంటికే.’

‘విశాల్ ఏంచేస్తున్నాడు... తేవచ్చుకదా... ఈ సమయంలో నిన్ను అపు రూపంగా చూసుకోవాలి.’

ఆ మాటకి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నవ్యకి కనిపించకుండా కంట్లో నలుసు పడినట్టుగా కళ్లు నలుముకుంటూ ‘అతనికి మాత్రం టైమేదీ?’ అన్నాను.

‘ఏం టైం లేక ఏం చేస్తున్నాడు? నీకన్నా ఇంపార్టెంట్ పనులున్నాయా?’

‘అయినా నేను ఈ విషయం అతనికి చెప్పలేదు.’

'వ్వాట్? ఆశ్చర్యంగా చూసింది... చెప్పలేదా? ఇంత ఆనందకరమైన వార్త చెప్పలేదా? ఎందుకని?'

'తనకి పిల్లలంటే ఇష్టంలేదు.'

'ఏంటే పిచ్చా?' చిరాగ్గా చూసింది. 'స్పెసిమన్‌లా ఉన్నాడే... పిల్లలంటే ఇష్టంలేని వాళ్లుంటారా? మీ ప్రేమ చిహ్నంగా పిల్లలు కావాలనుకోవాలిగాని...'

నేనేం మాట్లాడకుండా నవ్వి ఊరుకున్నాను. నవ్య లేచి ఫ్రిజ్ తెరిచి నారింజపండ్లు తీసి, రసం తీసిచ్చింది. 'అన్నట్టు వారం క్రితం మా ఇంటికి వచ్చాడు విశాల్' అంది జ్యూస్ అందిస్తూ.

నేను షాకింగ్‌గా చూశాను. 'అవునా? దేనికి?'

'నీకు చెప్పలేదా?' అనుమానంగా చూసింది.

'లేదు మర్చిపోయాడేమో.'

నవ్య ఏం మాట్లాడలేదు.

'ఏమన్నాడు?' అడిగాను, అదిరే గుండెలు చిక్కబట్టుకుని... ఎందుకు వచ్చినట్టు నాకు చెప్పను కూడా లేదు.

'ఏంలేదు... కాస్సేపు నా అందం పొగిడాడు. వంటరిగా ఎలా ఉండగలుగు తున్నావు అని అడిగాడు. లివింగ్ టుగెదర్ మీద నా అభిప్రాయం అడిగాడు. కాఫీ ఇచ్చాను. తాగాడు... వస్తాను బై అంటూ వెళ్లిపోయాడు.'

'అలాగా' లోతు స్వరంతో అన్నాను. నారింజ రసం చేదుగా అనిపించింది. కొంచెం తాగి 'సయించడం లేదే' అంటూ టీపాయ్ మీద గ్లాసు పెట్టేసాను.

'సయించకపోయినా కొన్ని సమయాల్లో కొన్ని పదార్థాలు తినాలి. నచ్చక పోయినా కొన్ని సందర్భాల్లో కొన్ని పనులు చేయాలి. ఇది చిన్న సూత్రం. జీవన సూత్రం... తాగు' అంటూ ఆప్యాయంగా గ్లాసు నోటికందించింది.

చెమర్చిన నా కళ్లనుంచి ఒక కన్నీటి చుక్క గ్లాసులో పడింది.

కాస్సేపు కూర్చుని లేచి ఇంటికి వచ్చేశాను. నా మనసు మనసులో లేదు. ఏవేవో ఆలోచనలతో తల పగులుతున్నట్టుగా ఉంది. తూలిపోతూ ఇంట్లో అడుగు పెట్టిన నేను అక్కడ కనిపించిన దృశ్యంచూసి నిర్ఘాంతపోయాను. గట్టిగా కౌగలించు కుని ముద్దు పెట్టుకుంటున్న యువతిని చటుక్కున వదిలేశాడు నా రాకతో. నన్ను

చూసి రివ్వున పారిపోయిందా యువతి... పక్కింట్లో ఇంటర్ చదువుతున్న పదహారేళ్ల ప్రతిమ.

శిలలా నిలబడిపోయిన నన్ను చూస్తూ... 'ఎక్కడికెళ్లావు? లేట్ అయిందేం..' అడిగాడు ఏమీ జరగనట్టు సాధారణంగా.

నేను ఏం మాట్లాడలేదు. అలాగే కళ్లప్పగించి చూస్తూ ఉండిపోయాను.

'ఏం కొంపలంటుకుపోలేదు. నీకోసం వచ్చిందా అమ్మాయి. ముద్దొచ్చింది పెట్టుకున్నాను తప్పేంటి?' అన్నాడు.

చాచి చెంప పగిలేలా  కొట్టాలనిపించింది. విసురుగా లోపలికి వెళ్లి పోయాను.

ఏమయింది? ఎలా జరిగిందిలా? ఇతను నేను ప్రేమించిన విశాలేనా? ఎంతో సంస్కారవంతుడిగా, సోకాల్డ్‌గా కనిపించిన విశాలేనా? ఇంజనీరు విశాలే నా? ఇతనిలో ఇన్ని బలహీనతలు ఉన్నాయా? ఇవి బలహీనతలా? అతనిలో ఉన్న నీచప్రవృత్తి తాలూకు పరంపరలా? ఎలా? ఎలా మోసపోయాను.

సిగ్గు, ఎగ్గు తెలియని విశాల్ నా పక్కకి చేరాడు. 'నువ్విలాంటివి చూసి బాధపడుతుంటే నీ జీవితం అంతా బాధపడడానికే సరిపోతుంది... నాకున్న బలహీనత ఇదొక్కటే... ఆడవాళ్లని చూస్తే ఆగలేను. నీకు పిల్లలంటే ఇష్టం కదా... డాక్టర్ దగ్గరకు వెడదాం పద' అన్నాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. నన్ను చూస్తుంటే నేను ప్రెగ్నెంట్ అని అర్థం కావడంలేదా? అది కూడా గమనించనంత గుడ్డిగా నన్ను ప్రతి రాత్రీ అనుభవి స్తున్నాడా? వాపు చూసి బలుపు అనుకున్నట్టు నా కడుపు చూసి నేను లావయ్యానని అనుకుంటున్నాడు.

నెమ్మదిగా అన్నాను 'నీకు తెలియదా? నేను ప్రెగ్నెంట్.'

'వ్వాట్' చటుక్కున్న నామీంచి లేచి లైటు వేశాడు. దగ్గరగా వచ్చి పొట్టమీద తడుతూ 'అవునా? ఏంటి లావయ్యావు అనుకున్నా... మొత్తానికి నీకోరిక తీరు తోందన్న మాట... ఓకే... నో ప్రాబ్లెం.... నీకు తొమ్మిదో నెల వచ్చి, డెలివరీ అయిందాక నిన్ను డిస్టర్బ్ చేయను... బట్ నాకో హెల్ప్ చేస్తావా?'

నొసలు చిట్లించి చూశాను.

'నీ ఫ్రెండ్ మీద చాలా మనసుగా ఉంది. నాకు నవ్య కావాలి. జస్ట్ కొంత కాలం... స్టెప్నీలాగా... నీ కడుపు, బాలింతతనం అంతా అయిందాకా.'

స్థాణువై వింటోన్న నాకు అతడి చెంప పగలగొట్టడానికి నా చేతులు ఎందుకు మొరాయిస్తున్నాయో అర్థం కాలేదు. శక్తి కూడదీసుకుని అరిచాను... 'ఐ సే షటప్..' అంత గట్టిగా ఎలా అరిచానో నాకే అర్థంకాలేదు. 'నీకు సిగ్గు లేదూ గెట్ అవుట్ ఫ్రం హియర్.'

'ఏయ్ హోల్డ్ యువర్ టంగ్. నీకు నా సంగతి తెలియదు. నేను ఏం చేసినా నోరు మూసుకుని ఉండు. అంత గొంతుతో ఈసారి అరిస్తే గొంతు నొక్కేస్తా... బిహేవ్ యువర్ సెల్ఫ్' మంచం మీంచి లేచి సిగరెట్ తీసి విలాసంగా వెలిగించుకుంటూ బైటకి వెళ్లిపోయాడు.

నా కళ్లముందు నేను కట్టుకున్న అద్దాల మేడ ముక్కలుగా విరిగి నామీదే పడుతున్న భావన.

గుండెనిండా గాయాలతో రక్తం ఓడుతున్న అనుభూతి... మంట... గుండె, కడుపు, కళ్లు మంట... అణువణువూ మంట... నిశ్చేతనై పడుకుండిపోయాను.

రోజులు గడుస్తున్నకొద్దీ నాకు పిచ్చెక్కిపోతున్నట్టు అనిపించసాగింది. విశాల్‌లోని స్వార్థం, పిసినారితనం, పశువాంఛ, స్త్రీల పట్ల అతని అభిప్రాయాలు... ఇవన్నీ నాకు మరో విశాల్‌ని చూపించసాగాయి. ఆ విశాల్ నీచుడా... పరమ నీచుడు... ఇది నిజమేనా? నేనెలా మోసపోయాను. ఈ బంధం నిలుపుకోనా? తెంపుకోనా? తెంపుకుంటే ఎలా బతకాలి? నవ్యకున్న తెగింపు, ధైర్యం నాకు లేవు. నాకు నెలలు నిండుతున్నాయి. అదేం గమనించని పశువు ప్రతి రాత్రీ నామీద పడుతూనే ఉన్నాడు. మా ఇద్దరి మధ్యా ఇప్పుడు అనురాగం, ప్రేమ లేవు. అతనిలో కామం... నాలో అసహ్యం... కానీ, ఒక కప్పుకింద ఉంటున్నాం. ఒకేసారి తింటున్నాం. ఒకే మంచం మీద పడుకుంటున్నాం. నేనిప్పుడు ఓ యంత్రంలా మారాను. భవిష్యత్తు గురించిన ఆలోచనలతో నాకు నిద్రపట్టడంలేదు. ఎవరికి చెప్పుకోవాలో, ఎవరిని సలహా అడగాలో అర్థం కాలేదు. నవ్యకి చెప్పాలంటే అవమానంగా అనిపిస్తోంది. సరితకి చెప్పాలంటే గిల్టీగా ఉంది. అమ్మకి చెప్పు కోవాలంటే అమ్మ నన్ను వదిలేసింది... ఎవరికి చెప్పుకోను?

ఆరోజు నవ్య దగ్గర్నించి ఫోన్ వచ్చింది. 'ధన్యా సాయంత్రం కాలేజీ నుంచి మా ఇంటికి రా ఓసారి... చిన్న పనుంది' అంది.

కొంచెం తనతో మాట్లాడితే మనసు కాస్త తేలికన్నా అవుతుందనిపించి సాయంత్రం ఐదింటికి నవ్య ఇంటివైపు వెళ్లాను. ఆటోదిగి తన ఫ్లాట్ వైపు నడిచాను. తలుపు వేసి ఉంది. సాధారణంగా నవ్య తలుపు వేసుకునే ఉంటుంది ఫ్లాట్స్

కదా... కాలింగ్‌బెల్ నొక్కాను. రెండు నిమిషాల తర్వాత డోర్ తెరుచుకుంది. చెదిరిన జుట్టు... కందిన మొహం... చున్నీలేని చుడీదార్‌తో నవ్య. ఏదో తేడా... ఎప్పటి నవ్య కాదు. పూసిన రోజాలా ఉండే నవ్యలో ఏదో లోటు... అనుమానంగా లోపలికి అడుగుపెట్టాను. సిగరెట్ వాసన... పరిచితమైన వాసన.

వణుకుతున్న శరీరం... కళ్లల్లో నిప్పు కణికలు... సోఫాలో కాలు మీద కాలేసుకుని విలాసంగా సిగరెట్ కాలుస్తున్నాడు విశాల్.

నేను నిశ్చేష్టురాలినై నవ్య వైపు చూశాను. ఎంత ద్రోహం... మిత్ర ద్రోహం... 'ఎప్పటి నుంచి సాగుతోందే...' మండిపడుతూ అడిగాను.

నవ్య చూపు నిప్పురవ్వలా తాకింది.

'నీ మొగుడిని అడుగు. ప్రేమించి పెళ్లి చేసుకున్నావుగా... చాలా మంచి వాడు అని సర్టిఫికెట్ ఇచ్చావుగా అడగవే... నేను వీడికి ఉంపుడుగత్తెగా ఉండాలిట... నామీద మహా మోజుట... దాదాపు నెలరోజులుగా వేధిస్తున్నాడు. నా స్నేహితురాలి భర్త అని ఇంతకాలం ఓపిగ్గా చెప్పాను. ఇవాళ అతని విశ్వరూపం చూపించడానికే నిన్ను రమ్మన్నాను. చూశావుగా... ఇంక నీ భవిష్యత్తేంటో నిర్ణయించుకో... వివాహబంధం సున్నితమైంది. జాగ్రత్తగా కాపాడుకోవాలి. కానీ ఆ బాధ్యత కేవలం ఆడదానికే లేదు... ఆ బంధాన్ని గౌరవించాల్సిన బాధ్యత మగాడిది కూడా. భార్య, పిల్లలు, ముచ్చటైన సంసారంకన్నా తుచ్ఛమైన శారీరక సుఖానికి విలువిచ్చే ఇలాంటి మగాడికి పెళ్లి, పెళ్లాము, ఇల్లు ఎందుకే? అచ్చోసిన ఆంబోతులా రోడ్డు మీద వదిలేస్తే ఏ పిశాచమో చంపేస్తుంది. దరిద్రం వదులుతుంది.'

అన్ని మాటలంటున్నా కించిత్తు కూడా చలనం లేకుండా నిర్లక్ష్యంగా నావైపు చూసి, బైటికి వెళ్లిపోతోన్న ఆ మొగుడనే ఆంబోతుని భావరహితంగా చూస్తూ స్థాణువులా నిలబడిపోయాను.

తెరలు, తెరలుగా గుండె చీల్చుకుని దుఃఖం రాసాగింది. చలనం కోల్పోయి బ్యాగు పక్కన పడేసి, మంచంమీద శిలలా కూర్చుండిపోయాను. ఏం జరుగుతోంది? నా సంసారం... ఆదర్శంగా ఉండాలనుకున్న నా సంసారం ఏమవబోతోంది... ఎంతో అసాధారణంగా ఉండాలనుకున్న నా భర్త సాధారణ వ్యక్తా? కాదు, కాదు... సాధారణం కన్నా తక్కువ... అతని స్థాయి ఏవిధంగా నిర్ణయించగలను? ఇంత జరిగాక ఎలా కలిసి బతకను? విడిపోయి ఎందుకు విడిపోయావంటే సమాజానికి ఏం సమాధానం చెప్పను? ఇలాంటివాడని చెప్పనా? పుట్టబోయే నా కొడుక్కి తన తండ్రి గురించి ఏం చెప్పను?

'ధన్యా ఏం ఆలోచిస్తున్నావు? ఇంకా ఇలాంటి నేలబారు మనిషితో బతకడం గురించే ఆలోచిస్తున్నావా?'

ఉలిక్కిపడి చూశాను నవ్య వైపు. ఆరోజు నవ్య భర్తతో విడాకులు తీసుకుందని తెలిసిన రోజు కారణం అడిగితే సరిగ్గా ఇదే సమాధానం వచ్చింది... 'ఒట్టి నేలబారు మనిషి'... అవును నేలబారు మనిషి... ఇప్పుడర్థమైంది అంటే ఏంటో.

***

*(ప్రతిఘటన మాసపత్రిక, 2012)*